

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## శ్రీవారి సేవలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**నెల్లూరు, జూలై 19, ప్రభాతవార్త - వైద్యం** కలియుగ దైవం అయిన తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని ఆదివారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దర్శించుకున్నారు. ఆయనతో పాటు శ్రీవారిని మనుబోలు మండల టీడీపీ నేతలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఏడుకొండల స్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు.

## వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



**గూడూరు, జూలై 19, ప్రభాతవార్త** గూడూరు పట్టణం లోని విజయ దుర్గా దేవి ఉప పీఠం నందు వారాహి అమ్మవారి గుప్త నవరాత్రుల్లో భాగంగా ఆరోవ రోజు అమ్మవారికి హోమంను నిర్వహించారు. అనంతరం ఉప పీఠం నిర్వాహకులు డాక్టర్ కోట సునీల్ స్వామి అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ,ప్రసాదాలను అందచేశారు.

## నరసాపురంలో రూ.58 లక్షల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

- ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న కూటమి ప్రభుత్వం
- అంగన్వాడీలకు తల్లికి వందనం చారిత్రాత్మక నిర్ణయం
- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



**ఇందుకూరుపేట, జూలై 19, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నరసాపురం పంచాయతీలో రూ.58 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆమె ప్రారంభోత్సవం చేశారు.

**అనంతరం గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే తన లక్ష్యమని, కనీసం 50 శాతం హామీలు నెరవేర్చిన తర్వాతే ఆయా గ్రామాల్లో పర్యటిస్తానని ముందుగానే స్థానిక నాయకులకు చెప్పినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక ప్రాంతాల్లో ఆ లక్ష్యాన్ని చేరుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైపాడు కాలువ, మైపాడు బ్రాంచి కాలువపై రూ.14.50 లక్షలతో నరసాపురం గ్రామ సమీపంలో నిర్మించిన రెండు కల్వర్టులను ప్రారంభించారు. వీటి నిర్మాణంతో దాదాపు 30 ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపామని అన్నారు. అలానే రూ.8.10 లక్షలతో నరసాపురం గ్రామ పంచాయతీలో నిర్మించిన అంతర్గత సిమెంటు రోడ్లను, రూ.35.50 లక్షలతో విశాఖ హరిజనవాడలో జల్ జీవన్ మిషన్ కింద ఏర్పాటు చేసిన ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లను ఎమ్మెల్యే ప్రజలకు అంకితం చేశారు. నరసాపురం గ్రామ ప్రజలు ఎంతోకాలంగా తన రాక కోసం ఎదురుచూశారని, వారు చూపించిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మైపాడు కాలువ, మైపాడు బ్రాంచి కాలువపై నిర్మించిన కల్వర్టులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో గ్రామ ప్రజలు కోరిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గృహాలు తదితర పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే నరసాపురంలో రెండు కిలోమీటర్ల డ్రెయిన్ల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేశామని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

❖ మైపాడు రహదారి నిర్మాణం ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి సహకారంతో రహదారి పూర్తికావడంతో ఇందుకూరుపేట మండల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తోందని ప్రశాంతి రెడ్డి తెలిపారు. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ పెంపు, మత్స్యకారుల సేవలో, ఆటో సేవలో, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఆక్వా రైతులకు విద్యుత్ ఛార్జీలు తగ్గించామని, త్వరలో కొత్త పెన్షన్లను కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. యాగర్ల సెంటర్‌లో ఎన్నేళ్లుగానో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు శాశ్వత పరిష్కారంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సహకారంతో మూడు నెలల్లోనే బ్రిడ్జి పనులు ప్రారంభించగలిగామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు వైద్య సహాయం అందిస్తున్నామని వివరించారు.

**అంగన్వాడీలకు తల్లికి వందనం..** అంగన్వాడీ కేంద్రాలకు కూడా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సిలిండర్ల వినియోగంలో ఉన్న ఇబ్బందులను గుర్తించి అంగన్వాడీలకు ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్లు కూడా అందిస్తున్నామని, ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయనంత మేలు కూటమి ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థకు చేస్తోందన్నారు.

**నరసాపురంలో రూ.1.35 కోట్ల అభివృద్ధి..** నరసాపురం పంచాయతీలో గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా ఎమ్మెల్యే గారు వివరించారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నరసాపురం పంట కాలువపై కల్వర్టు మరమ్మతులకు రూ.3 లక్షలు, మైపాడు కాలువ సమీపంలోని కల్వర్టు మరమ్మతులకు రూ.11.50 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా మూడు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.8.10 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఐదు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు 28 దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మార్పిడి, రెండు కిలోమీటర్ల మేర కండక్టర్ల మార్పిడి, ఆర్‌డీఎస్‌ఎస్ పథకం కింద 20 కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, 1.5 కిలోమీటర్ల మేర కండక్టర్ల ఏర్పాటు, లైన్ కన్వర్షన్ పనులను రూ.16.92 లక్షల వ్యయంతో పూర్తి చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్ కింద విశాఖ హరిజనవాడలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు, వెటర్నరీ ఆసుపత్రి వద్ద కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను రూ.38.50 లక్షలతో నిర్మించినట్లు చెప్పారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా పోతురాజు స్వామి ఆలయం, భావన రుషి ఆలయ నిర్మాణాలకు రూ.47 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోటా నుంచి రూ.10 లక్షల ఎల్‌వోసీతో పాటు నాలుగు పేద కుటుంబాలకు మొత్తం రూ.12.61 లక్షల విలువైన ఆర్థిక సహాయ చెక్కులు అందజేసినట్లు వెల్లడించారు. మొత్తంగా నరసాపురం పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం ఇప్పటివరకు రూ. 1.35 కోట్లకు పైగా వ్యయం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు నిర్వహించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కళ్యాణ్ రెడ్డి తెదేపా మండల అధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎస్ఎంఈ డైరెక్టర్ వీరేంద్ర నాయుడు, మండల బిజెపి అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి సురేష్ నాయుడు, దాసరి విజయ్, దేవస్థాన ఛైర్మన్ గుండాల కృష్ణారెడ్డి, అవ్వారు ఏడుకొండలు, బీసీ సెల్ అధ్యక్షుడు మారుబోయిన జనార్దన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## సైకిళ్ల పంపిణీ కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా - మంత్రి నారాయణ



**నెల్లూరు, జూలై 19, ప్రభాతవార్త-వైద్యం :** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతున్న 10 వేల మంది పేద విద్యార్థుల కోసం 6 కోట్ల రూపాయల సొంత నిధులతో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తలపెట్టిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమం వర్షాల కారణంగా తాత్కాలికంగా వాయిదా పడింది.

**పురపాలిక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ** వర్షాల కారణంగా సైకిళ్ళ పంపిణీ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని తెలిపారు. వాతావరణం అనుకూలిస్తే శుక్ర, శనివారాల్లో పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం వర్షపు నీరు చేరిన వీఆర్సీ గ్రౌండ్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. సైకిళ్ల పంపిణీ ఏర్పాట్లకు వర్షం ఆటంకం కలిగించటంతో వీఆర్సీ మైదానాన్ని మంత్రి నారాయణ ఆదివారం స్వయంగా పరిశీలించారు. గత ప్రభుత్వం నెల్లూరు నడిబొడ్డున ఉన్న వీఆర్సీని పూర్తిగా మూసేసిందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్రంలోనే ఒక బెంచ్ మార్క్‌గా అభివృద్ధి చేయడం వల్లే, అక్కడ 1100 సీట్లు ఉంటే ఏకంగా 4500 దరఖాస్తులు వచ్చాయని గుర్తుచేశారు. సోమవారం తొలి విడతగా 7 వేల సైకిళ్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ, మైదానంలో వర్షపు నీరు చేరడం, వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల వల్ల పంపిణీని వాయిదా వేస్తున్నామని తెలిపారు. వాతావరణం అనుకూలిస్తే 24వ లేదా 25వ తేదీ శుక్ర, శనివారాల్లో సైకిళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

**డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ** మంత్రి నారాయణ కుటుంబ సభ్యులు తమ సొంత నిధులతో కొనుగోలు చేసిన 7 వేల సైకిళ్లను మొదటి దశలో 8,9,10 తరగతుల విద్యార్థులకు అందజేస్తామన్నారు. మంత్రి నారాయణ ప్రతి ఏటా 10 కోట్లను పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం కేటాయిస్తున్నారని కొనియాడారు.

**నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ** మంత్రి నారాయణ నిరంతరం శ్రమించే ఒక పనిచేసే యంత్రం అని, నెల్లూరుతో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను అభివృద్ధి చేయడమే ఆయన లక్ష్యమని పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత నెల్లూరులో ఎవరికీ రానంత భారీ మెజార్టీ ఆయనకు వచ్చిందని, మంత్రి తన సొంత నిధులతో ఒకేసారి 7 వేల సైకిళ్లను పంపిణీ చేయడం దేశంలోనే మరెక్కడా జరగలేదన్నారు. దివంగత మాజీ సీఎం అంజయ్య లాగే నారాయణ కూడా తన చిన్ననాటి కష్టాలను గుర్తుచేసుకుంటూ తాను పడ్డ కష్టాలు నేటి తరం పిల్లలు పడకూడదనే ఈ సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు.

**బీజేపీ నేత కర్నాటి ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ** మంత్రి నారాయణ ఎంతో కష్టపడి స్వశక్తితో పైకొచ్చారని, ఆయన భవిష్యత్తులో మరెంతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మంత్రి నారాయణ తన విద్యాసంస్థల ద్వారా దేశ వ్యాప్తంగా విద్యా వ్యవస్థను విస్తరించడమే కాకుండా, వేలాది మందికి ఉపాధి కల్పించి ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలిచారని కొనియాడారు. కమీషనర్ నందన్, డిఈఓ బాలాజీరావు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి, రామకృష్ణ, కిన్నెర ప్రేమ్ కుమార్, టీడీపీ నేతలు డాక్టర్ పోకల రవి, కిన్నెర ప్రసాద్, బాలాజీ, తిరుమల నాయుడు, దర్శి హరికృష్ణ, జహీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని సందర్శించిన ఛైర్ పర్సన్ మేకపాటి




**వింజమూరు, జూలై 19, ప్రభాతవార్త** వింజమూరు మండలంలోని గుండేమడకల గ్రామ గ్రంథాలయాన్ని ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్ పర్సన్ మేకపాటి శాంతికుమారి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయంలోని రికార్డులు, పుస్తకాలను, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాల సంఖ్య, పాఠకుల రాకపోకల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు ఛైర్‌పర్సన్‌కు సమస్యలను వివరిస్తూ గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు లేవని, పాఠకులకు కూర్చోవడానికి తగిన సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటివి లేవని విన్నవించారు. కొత్త పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారి విజ్ఞప్తికి స్పందిస్తూ ఛైర్‌పర్సన్ మేకపాటి శాంతికుమారి మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. తప్పనిసరిగా పాఠకులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. మొదటి దశలో గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు, కుర్చీలు, టేబుళ్ల వెంటనే ఏర్పాటు చేస్తాను అని హామీ ఇచ్చారు. గ్రంథాలయాలను కేవలం పుస్తకాల గదులుగా కాకుండా జ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, యువత, విద్యార్థులు ఎక్కువగా గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సురేంద్ర బాబు గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోటలో అంబేడ్కర్ గురుకులం మూసివేత

- అర్ధరాత్రి ఉత్తర్వులు..మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు




**కోట, జూలై 19 ప్రభాతవార్త** కోటలోని అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలకు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. ఈ గురుకులానికి ఆ నాటి సీఎం, దివంగత నందమూరి తారకరామారావు శంకుస్థాపన చేశారు. మరో నేత, దివంగత రెవెన్యూశాఖ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ గురుకులాన్ని కోటకు మంజూరు చేయించారు. 1987లో కోటలో ఎస్సీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. 39 సంవత్సరాల చరిత్ర కలిగిన గురుకులాన్ని ఉన్నఫళంగా ప్రభుత్వం మూసివేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ మేరకు ఆదివారం ఇక్కడ గురుకులంలో చదువుతున్న 450 మంది విద్యార్థులు పెట్టేబేడ సర్దుకుని ఆటోల్లో నాయుడుపేట, వాకాడు, చిల్లకూరు గురుకులాలకు తరలివెళ్లారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆటోలు తీసుకొచ్చి తమ బిడ్డలను ఆయా ప్రాంతాల్లోని గురుకులాలకు తీసుకెళ్లారు. ప్రభుత్వం రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఐఐటిఐ, నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ కేంద్రాలను మంజూరు చేసింది. అందులో నెల్లూరు జిల్లా కోట, విశాఖపట్నం జిల్లా మేఘాద్రిగడ్డ, గుంటూరు జిల్లా తాడికొండలలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా కోటలోని అంబేడ్కర్ గురుకులాన్ని మూసేసి విద్యార్థులను ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ గురుకులాన్ని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రంగా మార్చారు. అయితే విద్యా సంవత్సరం జూన్ 12నే ఈ నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని, ఇప్పుడు హఠాత్తుగా తమ బిడ్డలను ఇతర గురుకులాల్లో చేరాలంటూ అధికారులు చెప్పడం సమంజసం కాదన్నారు. 39 ఏళ్లుగా గురుకులంలో వేలాది మంది విద్యార్థులు చదువుకుని ఉన్నత రంగాల్లో స్థిరపడ్డారు. వారు కూడా గురుకులం మూసివేతపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక స్కూల్‌ను మంజూరు చేయించుకుని ఏర్పాటు చేయడం అంత ఆషామాషీ విషయం కాదు. నాడు పెద్దలు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ గురుకుల పాఠశాలను ఇక్కడ ఏర్పాటు చేసిన విషయాన్ని మండల ప్రజలు గుర్తుచేస్తున్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ జోక్యం చేసుకుని గురుకులాన్ని ఇక్కడే కొనసాగించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడాలని కోరుతున్నారు.



## జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం



**నెల్లూరు,జులై 19 ప్రభాతవార్త- విద్య** నెల్లూరుజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో రెండు రోజులపా టూ నిర్వహిం చిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు ఆదివారం తో ముగిసాయి. అండర్ 11, 13,15,17,19, లతో పాటూ మెన్స్, ఉమెన్స్, సింగిల్స్, డబుల్స్ ల్లో పోటీలు నిర్వహించారు. 72 మంది క్రీడా కారులు ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిన ఏసీస్టేడియంలో విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతు ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా జిల్లా స్థాయి పోటీలను నిర్వహించటం జరిగిందన్నారు. వివిధ ప్రాంతాల నుండి ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇంత మంది క్రీడాకారులు ఇక్కడికి రావటం సంతోషంగా ఉందన్నారు.ఈ పోటీల్లో విజేతలైన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నామరి, అక్కడ కూడా వీరు విజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శంకర్, నారాయణరావు, ప్రసాద్ , వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జూలై 19, ప్రభాతవార్త - కలెక్టరేట్** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీ కోసం. ఏపి.జివోవి.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చును. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు,తాగునీటి సౌకర్యం,అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొనితమసమస్యలకు పరిష్కారంపొందాలనికలెక్టర్ ఆప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియపై ఫీడ్ బ్యాక్ స్వీకరణ

- క్యూఆర్ కోడ్ ద్వారా పారదర్శకతకు పెద్దపీట
- జిల్లా పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, డిఆర్వో విజయ కుమార్



**నెల్లూరు, జూలై 19, ప్రభాతవార్త - కలెక్టరేట్** ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా, రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు చేసిన పౌరుల నుండి నేరుగా ఫీడ్‌బ్యాక్ సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చిందని జిల్లా పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, డిఆర్వో విజయకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంపై ముఖ్యమంత్రి కార్యాలయం చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ ప్రత్యేక శ్రద్ధ వహించారు. ప్రజల సమస్యల పరిష్కార ప్రక్రియ ఎంత పారదర్శకంగా, సమర్థవంతంగా జరుగుతుందో తెలుసుకోవడానికి ఈ ఫీడ్‌బ్యాక్ ఎంతో కీలకమని అధికారులు తెలిపారు. **ప్రజలకు విజ్ఞప్తి** ఫిర్యాదుదారులు తమ సమస్యల పరిష్కారంపై ఉన్న అభిప్రాయాలను పంచుకోవడానికి, సంబంధిత అధికారులు అందుబాటులో ఉంచిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలని కోరడమైనది. **ప్రదర్శన ప్రాంతాలు** ప్రభుత్వ కార్యాలయాలు, గ్రీవెన్స్ సెంటర్లు, మరియు పౌర సేవా కేంద్రాల్లో ఈ క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే చేయబడుతుంది.

**సామాజిక మాధ్యమాలు** వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ఈ క్యూఆర్ కోడ్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడమైనది.ఈ చొరవ ద్వారా పౌరుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కావున, ఫిర్యాదుదారులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ విలువైన అభిప్రాయాలను తెలియజేయవలసిందిగా జిల్లా పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, డిఆర్వో విజయకుమార్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఈనెల 21 నుండి శ్రీ మల్లికార్జునస్వామి కామాక్షితాయి

సన్నిధిలో ఆషాడ మాస సారె సమర్పణ



**బుచ్చి జులై 19 ప్రభాతవార్త** ఆషాడ మాసం పురస్కరించుకోని జులై 21 నుండి ఆగష్టు 12 వరకు భక్తి శ్రద్దల నడుమ జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో ఆషాడ మాస సారె సమర్పణ కార్యక్రమం జరుగుతుందని ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ ఇఒ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జులై 24 శుక్రవారం శ్రీకామాక్షితాయికి శాకాంబరిదేవిగా పండ్లు, కూరగాయాలు,ఆకుకూరలతో అత్యంత విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. ఆషాడమాసం సందర్భంగా ప్రతి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు ఖడ్గమాల పూజలు,సారె సమర్పణ నిర్వహించబడుతాయని అన్నారు. ఈఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

## వసతి గృహాల సంక్షేమానికి ప్రాధాన్యత

- సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలి




**కోవూరు, జూలై 19, ప్రభాతవార్త :** గతంలో ఈ రాష్ట్రాన్ని ఎన్ని ప్రభుత్వాలు పనిచేసినా వసతి గృహాల సంక్షేమంపై ఎవరు కూడా దృష్టి పెట్టిన దాఖలాలు లేవని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా చొరవ తీసుకుని వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన వస్తువులను పంపిణీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని బాలికల వసతి గృహ సముదాయంలో ఆదివారం విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన వివిధ రకాల మెటీరియల్ కిట్లను పంపిణీ చేశారు.

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుక్షణం పేద ప్రజల శ్రేయస్సు కోసమే ఆలోచిస్తున్నారన్నారు. వసతి గృహంలో చదువుతున్న విద్యార్థుల అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించి వారికి ఏ వస్తువులు అందిస్తే ఉపయోగపడతాయి అని ఆలోచించి నాణ్యమైన ఈ వస్తువులను పంపిణీ చేస్తుందన్నారు. 3వ తరగతి నుంచి పీజీ వసతి వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులందరికీ ట్రంకు బాక్సు, ప్లేట్లు, గ్లాసులు, బెడ్‌షీట్లు, టర్కీ టవళ్లు, సెవట్టర్లు, నైట్ డ్రస్సులతో పాటు స్పోర్ట్స్ షూ కూడా అందించడం జరిగిందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి సమాజంలో ఉన్నత స్థాయికి వెళ్లాలనే ఆకాంక్షతో కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత భవిష్యత్తును పాడు చేస్తున్న సోషల్ మీడియా వంటి దృష్టిని మరిచిపోయి ఉపయోగపడే అలవాట్లుకు దగ్గర కావాలని సూచించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ప్రత్యేకమైన దృష్టి సారించారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సువర్ణ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

**జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి శోభారాణి మాట్లాడుతూ** గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఇటువంటి నాణ్యమైన వస్తువులను అందించిందన్నారు. ప్రస్తుతం సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉత్తమ ఫలితాలతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూను వారికి ప్రత్యేకంగా అందిస్తున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వం సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో లక్షలాది రూపాయలు వ్యయం చేసి పెయింట్లు, ఎలక్ట్రిక్ రిపేర్లు, బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేసిందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ తిరుపతయ్య ప్రసంగించారు. ఆమె వెంట జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి శోభారాణి, ఏఎస్‌డబ్ల్యూ తిరుపతయ్య, ఎంపీపీ పార్వతి, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, మల్లికార్జునరెడ్డి బాల రవి, వెంకట్, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు, జహాంగీర్, సాధిక్, మురళి, సంక్షేమాధికారులు పద్మ, సుప్రజ, శోభారాణి, సుమలత, సునీత, కార్యాలయ పర్యవేక్షకులు దయాకర్, కూటమి నేతలు ఉన్నారు.



## స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

**– రూరల్ మండల ఎంపీడీవో వి. శైలేంద్ర కుమార్**



**నెల్లూరు, జూలై 19, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** నెల్లూరు రూరల్ మండలంలో స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా పంచాయతీ సిబ్బంది పని చేయాలని రూరల్ మండల ఎంపీడీవో వి. శైలేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడారు. సంక్షేమం అభివృద్ధి దిశగా రాష్ట్రం ముందుకెళ్లాలంటే తొలుత గ్రామపంచాయతీలు పరిశుభ్రంగా ఉండడం ముఖ్యం అన్నారు. స్వచ్ఛ గ్రామాల లక్ష్యసాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతిరోజు గార్బేజి సేకరణకు వచ్చే వాహనాల్లో తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి తరలించేందుకు సహకరించాలన్నారు. మండలంలోని 18 గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఏ పంచాయతీలోనైనా చెత్త సేకరణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. అన్ని గ్రామాలలో విద్యుత్ దీపాల సమస్య లేకుండా, మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక అధికారులు గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మొదటిగా గ్రామాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి ఆ దిశగా చైతన్యం చేస్తున్న విషయాన్ని అధికారులు తెలుసుకొని సమస్యలు లేని పాలనకు సహకారం అందించాలని కోరారు. తాను 18 పంచాయతీలను నిత్యం పర్యవేక్షిస్తూ అధికారుల పనితీరును గమనించడం జరుగుతుందని వెల్లడించారు. నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## గ్రంథాలయాలకు మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

**– చైర్ పర్సన్ శాంతి కుమారి**





**వింజమూరు, జూలై 19, ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని గ్రంథాలయాలకు మౌలిక వసతులు కల్పించి పాఠకులకు జ్ఞానాన్ని అందించే దిశగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ మేకపాటి శాంతి కుమారి తెలిపారు. ఆదివారం వింజమూరు శాఖ గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రీడింగ్ రూమ్ పుస్తకాల నిల్వలో పాఠకుల రిజిస్టరు మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి అవసరమైన మౌలిక సదుపాయాలు వరతగా ఉన్నాయని విశాలమైనటువంటి స్థలం కూడా లేకపోవడంతో ఇరుకుగా ఉండవలసి వస్తుందని పలువురు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుల నేతృత్వంలో గ్రంథాలయాలకు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే గ్రంథాలయాలు అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు పాఠకులకు అవసరమైన వస్తువులు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు జిల్లాలో రెండు ఆదర్శ గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని అందులో ఒకటి ఉదయగిరి గ్రంథాలయాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఉదయగిరి ప్రాంతాన్ని ఎంతో మంది రాజులు శ్రీకృష్ణదేవరాయలు చాళుక్యులు పల్లవులు తదితర గొప్పవారైన రాజుల పరిపాలించారని అలాంటి ప్రాంతంలో ఉన్న ఉదయగిరి గ్రంథాలయాన్ని చారిత్రాత్మకంగా ఉన్న గ్రంథాలను సేకరించి ప్రస్తుత పాఠకులకు వారి చరిత్ర వారి జీవిత విశేషాలు తెలిసే విధమైన పుస్తకాలను అందజేసి నేటి యువతీ యువకులకు వారి పాలన విశేషాలను తెలుసుకొనే విధంగా చేస్తానన్నారు. అలాగే వింజమూరు గ్రంథాలయంలో ఉన్న వస్తువులతో గ్రంథాలయ అధికారి జ్యోతి కొండయ్య తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నట్లు అభినందించారు. అనంతరం గ్రంథాలయానికి అవసరమైన సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో వనిపెంట హైమావతి మండల తెలుగుదేశం కన్వీనర్ గూడా నర్సారెడ్డి సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి దేగ మధు యాదవ్, మాజీ సొసైటీ డైరెక్టర్ గని శ్రీనివాస నాయుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూర్ రాజగోపాల్ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస్ యాదవ్, బిజెపి నాయకులు దాసరి ప్రసాద్, ఎన్నపల్లి పెంచలరావు, తిరపతి ఆచారి నీలం పెరుమాళ్, జూపల్లి వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎంపీడీవో కే రామారావు తదితరులు ఉన్నారు.

## ఏపీఎంఎఫ్ నూతన కార్యవర్గం



**ఉదయగిరి, జూలై 19, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ఉదయగిరి నియోజకవర్గ నూతన కార్యవర్గం ఆదివారం వ్యవస్థాపక అధ్యక్షులు ఢిల్లీ బాబుల్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లిఖార్జున ఆధ్వర్యంలో ఎన్నుకోబడింది. ఉదయగిరి నియోజకవర్గం ఏపీ ఎంఎఫ్ గౌరవ అధ్యక్షులుగా షేక్ గౌస్ భాషా, అధ్యక్షులుగా లెక్కమనేని రాజేష్, ఉపాధ్యక్షులు తాళ్లూరి చిన్నయ్య, గౌరవ ఉపాధ్యక్షులు డి.సూర్యనారాయణ, కార్యదర్శి శేషం రమేష్, సహాయ కార్యదర్శులుగా బివి నారాయణరెడ్డి, ఓంకారం శ్రీనివాసులు, గుడి వెంకట రాములు, కోశాధికారి షేక్ భాషా, కార్యవర్గ సభ్యులు ముంత ఉమామహేశ్వరరావు, దొడ్డ రాము, సురేష్, పూనూరి ఆల్విన్, మిట్ట బాలయ్య, పి.శివ బ్రహ్మయ్య, ఓబులాపురం అగస్టీన్, బి.పౌలు, బి.సుకుమార్, డి.ప్రసాద్ ఎన్నికయ్యారు.

## హత్యకేసులో ముగ్గురు నిందితులు అరెస్టు-మరొకరి కోసం గాలింపు



**కావలి, జులై 19 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం సర్వాయపాలెం పంచాయితీ త్రాగేటివారిపాలెం గ్రామానికి చెందిన చాట్ల వాసు హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి మరో నిందితుని కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు డిఎస్పి వివి.రమణకుమార్ తెలిపారు. రూరల్ పలీస్ స్టేషన్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్పి మట్లాడుతూ ఈనెల 10న అడవిరాజపలెం రోడ్డు వద్ద చాట్ల వాసును మేకల విషయంలో వచ్చిన వివాదంలో నిందితులు వాసుపై దాడిచేసిన విషయం తెలిసిందే. అనంతరం వాసు నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ ఈనెల 17న రాత్రి మృతి చెందాడు. ఈ దాడికి పాల్పడిన వారిని పందుల రవిచందును ఈనెల 16న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరిని త్రాగేటివారిపాలెంకు చెందిన ముందా మధు, పట్టణానికి చెందిన పసుపులేటి గణపతిలను అడవి లక్ష్మీపురం వద్ద అరెస్టు చేయడం జరిగిందన్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడు దేవరపల్లి నవీన్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దాడికి ఉపయోగించిన కారుమంచం కోడు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నిందితులపై రౌడీషీట్లు నమోదు చేసి వారి కదిలికలపై నిఘా పెంచుతామని తెలిపారు. చిన్న తగాదాలు చిలికి చికిలి హత్యలు చేసే స్థాయికి చేరుకోంటున్నాయి అలాంటివి సహించబోమని హెచ్చరించారు. రూరల్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు, ఎస్ఐ బాజీబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చొరవతో అభివృద్ధి పథంలో కొమ్మలపూడి



**మనుబోలు జులై 19 ప్రభాతవార్త :** మనుబోలు మండలం కొమ్మలపూడి గ్రామ నాయకులు టిడిపి మాజీ మండల ఉపాధ్యక్షులు మన్నెమాల బాస్కర్‌రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యే సో మిరెడ్డి సహకారంతో కొమ్మలపూడి అభివృద్ధి పథంలో నడుస్తొంది. బుడంగుంట చెరువు పంట కాలువ ఎన్నో ఏళ్ళుగా బీడు పడిపో వడంతో సమస్యలను మన్నెమాల ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తీసుకొని వెళ్ళగా ఆయన వెంటనే స్పందించి కాలువ పనులకు నిధులు మంజూరు చేశారని బాస్క ర్‌రెడ్డి తెలిపారు. కాలువ పూడిక తీయించారు. గ్రామంలో రెండు అంగన్‌వాడీ భవనాలకు నిదులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అలాగే 20 లక్షలతో గ్రామంలో డ్రైనేజి నిర్మాణం చేపట్టారు .కోట్లాది రూపాయాలు అబివృద్ది పనులు జరుగుతున్నాయని క్యాడర్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మన్నెమాల సొంత నిదులు కూడా వెచ్చించి నిరుపేదలకు అండగా నిలుస్తున్నారని క్యాడర్ ప్రశంసి స్తున్నారు.

## సర్వేపల్లి టీడీపీలోకి జోరుగా చేరికలు



**నెల్లూరు, జూలై 19, ప్రభా తవార్త – వైద్యం** పొదలకూరు మండలంలో బిరదవోలు పంచా యతీ నుంచి 10 కుటుంబాలు, విరువూరుకు చెందిన 14 కుటుం బాలు ఆదివారం ఎమ్మెల్యే సో మిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోచేరారు. వైసీపీని వీడి టీడీపీలో చేరినవారికి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కండువాలు కప్పి ఆత్మీయ ఆహ్వానం పలికారు. కూటమి ప్రభుత్వ హయాంలో జరు గుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి టీడీపీ వైపు ఆకర్షితులవుతున్న ప్రతి ఒక్కరికీ ఆహ్వానిస్తున్నామని ఎమ్మె ల్యే సోమిరెడ్డి తెలిపారు. విరువూరుకు చెందిన కొల్లి లీలామోహన్ రెడ్డి, కొల్లి సాయికృష్ణారెడ్డి, గౌరవరపు శ్రీనివాసులు, బోడమల బ్రహ్మయ్య, కొప్పుల ప్రసాద్, యాకసిరి వెంకటేశ్వర్లు, ముత్యాల గణేష్, సత్యం, ఇండ్ల అంబులయ్య, యాకసిరి దయాకర్, కొప్పుల సురేష్, తాటిపర్తి పెద్ద వెంకయ్య, బిరదవోలు పంచాయతీకి చెందిన చిడదల మస్తానయ్య, పెంచలయ్య, వెంకటరమణయ్య, వెంకటసుబ్బయ్య, పోలయ్య, ప్రసన్న, బడుగు వినోద్, కొత్తపల్లి రామస్వామి తదితరులు టీడీపీలో చేరారు.

## పెన్నా నదిలో గల్లంతైన యువకుడు

**నెల్లూరు క్రైం, జూలై 19, ప్రభాతవార్త :** నగరంలోని కొత్తూరు డైకాస్ రోడ్డు సెంటర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు పెన్నా నదిలో గల్లంతైన ఘటన స్థానికంగా విషాదం నింపింది. ఈత కోసం వెళ్లి యువకుడు ప్రాణాలు కోల్పోయినట్లుగా భావిస్తున్న ఈ ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఘటన వివరాల్లోకి వెళితే.. కొత్తూరు డైకాస్ రోడ్డు సెంటర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ సలాం (32) ఆదివారం తన స్నేహితులతో కలిసి విహారయాత్ర కోసం కొత్త కోడూరు బీచ్‌కు వెళ్ళారు. సాయంత్రం తిరిగి నగరానికి చేరుకున్న అనంతరం, వీరంతా కలిసి గుప్తా పార్క్ సమీపంలోని పెన్నా నది పొర్లు కట్ట ప్రాంతానికి చేరుకున్నారు. సరదాగా ఈత కొట్టేందుకు అబ్దుల్ సలాం తన స్నేహితులతో కలిసి పెన్నా నదిలోకి దిగాడు. అయితే, ఈత కొడుతుండగా అనుకోకుండా నదిలోని లోతైన ప్రాంతంలోకి వెళ్లడంతో అబ్దుల్ సలాం ఒక్కసారిగా నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. అబ్దుల్ సలాం నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గల్లంతైన అబ్దుల్ సలాం కోసం నదిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రాత్రి సమయం కావడంతో గాలింపు కష్టతరంగా మారినప్పటికీ, పోలీసులు గజ ఈతగాళ్ళ సహాయంతో తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషాద ఘటనతో అబ్దుల్ సలాం కుటుంబ సభ్యులు, స్నేహితులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐను కలిసి సన్మానించిన ఆర్యవైశ్యులు



**పొదలకూరు, జూలై 19, ప్రభాతవార్త :** పొదలకూరు ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శివ రాకేష్‌ని పొదలకూరు ఆర్యవైశ్యులు మర్యాదపూ ర్వకంగా కలిసిన ఘనంగా సన్మానించారు. ఎస్ఐని కలిసన వారిలో తిరుపతి పార్లమెంట్ రైతు సంఘం అధ్యక్షులు కోవూరు వెంకటేశ్వర్ల నాయుడు, ఏఎంసి డైరెక్టర్ ప్రభాకర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆకులూరి విజయ, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అమర్తలూరు చెంచయ్య,పొదలకూరు మండలం వాణిజ్య సంఘం అధ్యక్షులు గుర్రం మీరా మధుగారు, నున్నా వెంకటేశ్వర్లు, కొంజేటి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## కాకాణిని కలిసిన గూడూరు నూతన సమన్వయకర్త గురవయ్య



**నెల్లూరు, జూలై 19, ప్రభాతవార్త – వైద్యం :** మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు నియోజకవర్గ నూతన సమన్వయకర్తగా నియమితులైన గూడూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బూదూరు గురవయ్య మర్యాదపూర్వకంగా మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గానికి చెందిన నాయకులందరినీ కలిసి ఆశీస్సులు తీసుకోవాలని, నిరంతరం పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ, కూటమి ప్రభుత్వ ఆగడాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని గురవయ్యకు సూచించారు. గూడూరు నియోజకవర్గం ఎంతో చరిత్ర కలిగిన నియోజకవర్గం అని, ఉద్దండులు ఎంతో మంది శాసనసభ్యులుగా వెలుగొందారని, భౌతికంగా ఈరోజు మన మధ్య వారు లేకపోయినా, వారు చేసిన సేవలు ఎప్పటికీ గూడూరు ప్రజలు గుర్తుంచుకుంటారని, అదే రీతిలో గూడూరు నియోజకవర్గానికి మరింత మంచి పేరు తెచ్చి పెట్టే విధంగా ప్రవర్తించాలని గురవయ్యను కోరారు. జగన్మోహనరెడ్డి మంచి మనసుతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా అవకాశం ఇచ్చారని ప్రజలలో రాబోయే ఎన్నికల్లో గురవయ్య తప్పక విజయం సాధిస్తాడు అని, నమ్మకం, విశ్వాసం, కలిగించే విధంగా వ్యవహరించాలని, గురవయ్యకు తెలియజేశారు. నెల్లూరు జిల్లాలో పది నియోజకవర్గాలతో పాటు కందుకూరు, నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ స్థానాలతో తో సహ వైఎస్ఆర్ జండా ఎగరబోతున్నందున, గూడూరు నియోజకవర్గంలో కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. గురవయ్యకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, గూడూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఆశీస్సులు ఎల్లవేళలా జగన్ మోహన్ రెడ్డి ద్వారా నియమితులైన గురవయ్యకు అందజేయాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా కాకాణి విజ్ఞప్తి చేస్తూ, గురవయ్యకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## వాసు కుటుంబానికి అండగా కావలి ఎమ్మెల్యే

### మంద మధు అనుచరులపై చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు డిమాండ్



**కావలి, జులై 19 ప్రభాతవార్త :** కావలి మండలం, తాగేటివారిపాలెంకుచెందిన టిడిపి కార్యకర్త చాటల వాసు కుటుంబానికి ఉండగా ఉంటానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. వైసిపి నేత మంద మధు ఆయన అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. తాగేటివారిపల్లెంలో ఆదివారం వాసు అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు గ్రామానికి చేరుకొని వాసు అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబసభ్యులను ఓదర్చారు. వాసు కుటుంబసభ్యులకు అండగా మేము ఉంటామని కుటుంబసభ్యులకు దైర్యం చెప్పారు. న్యాయంజరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే కూడా వాసు కుటుంబానికి అండగా నిలిచారని వాసు హత్యహత్యాయత్నంకు పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్ష పడేంతవరకు క్షమించబోమని తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన ప్రధాన నిందితులైన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా చెప్పబడుతున్న మంద మధు, అతని అనుచరులపై సమగ్ర విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.అనంతరం కుటుంబసభ్యులకు దైర్యం చెప్పారు.

## పేద విద్యార్థుల ఉన్నత విద్యకు రూ.20వేలు ఆర్థికసాయం




**కావలి, జులై 19 ప్రభాతవార్త :** కావలి తుఫాన్ నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ ద్వారా ఇంటర్ చదువుతున్న ఐదుగురికి ఒకొక్కరికి రూ.4వేల చొప్పున రూ.20వేలు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా సురేంద్ర మాట్లాడు తూ తమ సంస్థచే 1నుంచి ఇంటర్‌వరకు సుమారు 70 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఇంటర్ చదువుతున్న ఆరుమందిలో 5మందికి కళాశాల ఫీజులు నిమిత్తం మొదట విడతగా దాతల సాయంతో ఒకొక్కరికి రూ.4వేలు రూ.20వేలు అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు మంచి విద్యను అభ్యసన కోసం ఈ సాయం అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆర్థికసాయం చేసిన దాతలకు కృతజ్ఞతలు సంస్థ తరపున, విద్యార్థులు తరపన తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని దాతలకు, సంయుక్తసేవా సంస్థకు మంచిపేరు తేవాలని కోరారు.

## రికార్డులు లేని వాహనాలపై కఠిన చర్యలు



**కావలి, జులై 19 ప్రభాతవార్త :** సరైన రికార్డులు లేని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎస్‌పి వి.రమణ కుమార్ తెలిపారు. పట్టణంలోని వివిధ విద్యా సంస్థలు, వాహనాలను ఆదివారం స్థానిక జడ్పి మైదానంలో ఉంచి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పాఠశాల, కళాశాలలకు వాహన డ్రైవర్లు లైసెన్స్‌లు సరైన రికార్డులు లేనిపక్షంలో బస్సులను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి ఎక్కిస్తే అలాంటి బస్సులపై చర్యలు తీసుకొని సీజ్ చేస్తామని తెలిపారు. నిబంధనలపై డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యహరిస్తే వేటు తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ రంగనాథ్‌గౌడ్, ఎస్ఐ సుమన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భవిష్యత్తు ప్రణాళిక విద్యార్థి రూపొందించుకోవాలి



**కావలి, జులై 19 ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళికల రూపొందించుకొని కెరియగ్ గైడెన్స్ వంటి పుస్తకాలను చదవాలని లోక్ అదాలత్ సభ్యులు మాల కొండారెడ్డి తెలిపారు. స్థానిక ముసునూరు గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు జిల్లా పోక్స్ కోర్టు న్యాయమూర్తి శైలజ కెరియర్ గైడెన్స్ పుస్తకాన్ని ప్రిన్సిపల్ సుజాత ఆదివారం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాలకొండారెడ్డి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు తన భవిష్యత్తుపై ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. వీటితో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి ఈ మార్గదర్శి కలిగిన పుస్తకాలను ప్రతి విద్యార్థి చదివి పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యతో పాటు భవిష్యత్తుపై కలలు కని ఇప్పటి నుంచి మార్గం ఎంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నారెడ్డిపాలెంలో అజ్ఞాత ఫ్యాక్టరీ అసలేం జరుగుతోంది?

**- విస్తీర్ణం ఎంత..? నిర్మాణం ఎంత..? పంచాయతీకి చెల్లిస్తున్న పన్నెంత..?**
**- కాలుష్య నియంత్రణపై పర్యవేక్షణ ఏది..?**
**- అధికారుల తనిఖీలు నామమాత్రమేనా..?**
**- ఫ్యాక్టరీ నిర్వహణపై అనేక అనుమానాలు.. - సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్**



**విడవలూరు,జులై 19 ప్రభాతవార్త :** మండలంలోని అన్నారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఓ ఫ్యాక్టరీ కార్యకలాపాలపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫ్యాక్టరీకి కేటాయించిన భూమి విస్తీర్ణం ఎంత..? అందులో నిర్మాణాలు ఎంత మేరకు ఉన్నాయి..? పంచాయతీకి ఏటాఎంత మొత్తంలో పన్ను చెల్లిస్తు_న్నారు..? ఫ్యాక్టరీ నిర్వహణకు సంబంధించి అవసరమైన అనుమతులు, లైసెన్సులు ఉన్నాయా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఏం తయారు చేస్తున్నారు..?ఫ్యాక్టరీలో అసలు ఏయే ఉత్పత్తుల తయారీ జరుగుతోంది..? రోజువారీ ఉత్పత్తి సామర్థం ఎంత..? వినియోగిస్తున్న ముడి పదార్థాలు ఏమిటి..? వాటి నిల్వ, వినియోగం, వ్యర్థాల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. సంబంధిత శాఖల అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.కాలుష్యం బయటకు ఎలా..?ఫ్యాక్టరీ నుంచి వెలువడే పొగ, వ్యర్థాలు, వ్యర్థ జలాలను ఏ విధంగా నిర్వహిస్తున్నారు..? కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం శుద్ధి ప్రక్రియ జరుగుతోందా..? వ్యర్థ జలాలను ఎక్కడికి తరలిస్తున్నారు..? గాలి, నీరు, నేల కాలుష్యంపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నారా..? కాలుష్య నియంత్రణ పరికరాలు పనిచేస్తున్నాయా..? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది.తనిఖీలు.. చర్యలు ఎక్క?సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా..? తనిఖీల్లో ఏవైనా ఉల్లంఘనలు గుర్తించారా..? గుర్తిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? పంచాయతీ, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ, పరిశ్రమల శాఖల అధికారులు సమన్వయంతో తనిఖీలు చేపట్టారా..? అనే విషయాలు కూడా వెలుగులోకి రావాల్సి ఉంది.అధికారులకు సవాలుగా మారిందా..?ఫ్యాక్టరీ నిర్వహణకు సంబంధించి స్థానికంగా వస్తున్న అనుమానాలు, ఫిర్యాదులపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. అధికారుల తనిఖీలు కేవలం రికార్డులకే పరిమితమవుతున్నాయా..?లేక నిబంధనల ప్రకారం వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తున్నారా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఫ్యాక్టరీ విస్తీర్ణం, నిర్మాణాల వివరాలు, పన్నుల చెల్లింపులు, అనుమతులు, కాలుష్య నియంత్రణ చర్యలు, వ్యర్థాల నిర్వహణపై పూర్తి స్థాయి నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.సమగ్ర తనిఖీ చేపట్టాలిఫ్యాక్టరీలో జరుగుతున్న కార్యకలాపాలు, అనుమతులు, కాలుష్య నియంత్రణ చర్యలు, పంచాయతీకి చెల్లిస్తున్న పన్నులు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కలిగిరి గ్రంథాలయాన్ని సందర్శించిన గ్రంథాలయ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి



కలిగిరి, జూలై19, ప్రభాతవార్త; గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారికి కలిగిరి కూటమి నాయకులు సాదర స్వాగతం పలికారు. ఉదయగిరి నియోజకవర్గం, కలిగిరి మండల కేంద్రంలో ఉన్నటువంటి గ్రేడ్ 3 గ్రంథాలయాన్ని ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి సందర్శించారు. గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి మొదటిసారి కలిగిరి గ్రంథాలయాన్ని సందర్శించి చేసిన మేకపాటి శాంతి కుమారికి స్థానిక కూటమి నాయకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం కలిగిరి గ్రంథాలయ సిబ్బందిపై నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు నాయకత్వంలో గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలనే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని, చదువుల తల్లి సరస్వతి దేవికి నిలయాలు గ్రంథాలయాలని, విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను అభివృద్ధి చేసి స్థానికంగా ఉన్నటువంటి గ్రామ ప్రజలకు యువతకు విద్యార్థులకు ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా గ్రంథాలయాలు అభివృద్ధి చేస్తామని, అందరూ గ్రంథాలయాలని సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు యువత పుస్తక పఠనం చాలా అవసరం అని, అందరు సహకారంతోనే గ్రంథా యాల అభివృద్ధి జరుగుతుందని, గ్రంథాలయ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ వెంగప్ప నాయుడు, మాజీ కన్వీనర్ బుజ్జి కృష్ణారెడ్డి, కాకు మహేష్, మాల్యాద్రి, కొండయ్య, సురేష్, భాస్కర్, కొండలరావు, నాగిరెడ్డి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన లుంబిని విద్యాలయం విద్యార్థి



**చేజర్ల, జూలై 19, ప్రభాతవార్త** చేజర్లలోని లుంబి ని విద్యాలయానికి చెందిన విద్యార్థి యు. హేమతేజ ప్రతిష్ఠాత్మకమైన ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి పాఠశాలకు, తల్లి దండ్రులకు గర్వకారణం గా నిలిచాడు. తాజాగా విడుదలైన ట్రిపుల్ ఐటీ ప్రవేశాల ఎంపిక జాబితాలో హేమతేజకు సీటు రావడంతో పాఠశాల ఆవరణలో ఆనందోత్సా హాలు నెలకొన్నాయి. విద్యార్థి సాధించిన ఈ విజయంపై లుంబిని విద్యాలయం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాలయాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ హేమతేజను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హేమతేజ క్రమశిక్షణతో చదువుతూ ఉపాధ్యాయుల సూచనలను పాటించి ఈ విజయాన్ని సాధించాడని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఉన్నత లక్ష్యాలను సాధిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలనిఆకాంక్షించారు. విద్యార్థి విజయంవెనుక అతని తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, పాఠశాల అం దించిన విద్యా వాతావరణం కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హేమ తేజకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరో హించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు తమ ఆశీస్సులు అందించారు.

## బాలుర వసతి గృహం విద్యార్థులకు మెటిరియల్ పంపిణీ



సంగం జులై 19 ప్రభాతవార్త సంగం మండలం దువ్వూరు గ్రామంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్దులకు మెటీరియర్ పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వసతి గృహంలోని విద్యార్దులకు మౌళిక సదుపాయాలతో పాటు వస్త్రదారణ పై దృష్టి పెట్టి విద్యార్దులకు రెండు నైట్ డ్రస్సులు, చలికి స్వెటర్, టర్కీటవల్,దుప్ప టి, రగ్గు, మెటిరియల్ అందజేశారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనల మేరకు ముఖ్య అతిధులుగా పాల్గోన్న నెల్లూరు పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి జడపల్లి దయాకర్‌గౌడ్, యూనిట్ ఇంచార్జి మారెళ్ళ శ్రీనివాసులు, ఐటిడిపి మండల ఉపాధ్యాక్షులు పులివర్తి వెంకటసుబ్బయ్యనాయుడు పాల్గోన్నారు. విద్యార్దులు ధ్యాంకు సిఎం సార్ అంటు ప్లకార్డులు చూపించారు. ఈకార్యక్రమంలో వార్డన్,సిబ్బంది పాల్గోన్నారు.

## రౌడిషిటర్లకు బుచ్చి ఎస్ఐ కౌన్సిలింగ్



**బుచ్చి జులై 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం టౌన్‌లోని రౌడి షీటర్లకు ఎస్ఐ ఉమాశంకర్ కౌన్సిలింగ్ ఇచ్చారు.రౌడి షీటర్లు స్టేషన్‌లో ఏ పోన్ మెంబర్ ఇస్తే ఆ నెంబరే మీదగ్గర ఉండాలి ఆ నెంబర్ మారిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఆదివారం స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలని హెచ్చరించారు. విధిగా సంతకాలు చేయకపోతే చర్యలు తప్పవని అన్నారు. మంచి ప్రవర్తనతో నడకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఎస్‌సి హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం విద్యాసామాగ్రి పంపిణి అభినందనీయం



**బుచ్చి జూలై 19 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం ఎస్‌సి బాలికల హాస్టల్స్‌లో,బాలుర హాస్టల్‌లో విద్యార్థులకువిద్యాసామాగ్రిని పంపిణి చేశారు .ఈకార్యక్రమంలో సిహెచ్‌సి డైరక్టర్ కోదండ రామిరెడ్డి, దళితనాయకులు సూదల రమణయ్య, విశ్రాంతి ఉపాధ్యాయులు పుల్లయ్య, రిటైడ్ పోస్టు మాస్టర్ రామయ్య, అవార్డు రత్న గ్రహిత గండికోట సుధీర్‌కుమార్, రిటైడ్ ఉపాధ్యాయులు రఘురాం ,సంక్షేమాధికారి నాగరాజు విద్యార్థు లకు విద్యాసామాగ్రి పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిధి దొడ్ల కోదండరామిరెడ్డి మాట్లాడుతు ఈ హాస్టల్స్ చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.హాస్టల్స్‌లో బాలికలు, ప్రభుత్వం వారికోసం ఏర్పాటు చేసిన వసతులు చాలా బాగున్నాయని అన్నారు. వార్డన్లు షకినా, సంధ్యామాదవిని వారు అభినం దించారు. ఈ హాస్టల్స్‌లో ప్రభుత్వం పౌష్టికాహారంతో కూడిన బోజనం అందజేస్తుందని అన్నారు. విద్యా ర్థులకు ట్రంకు పెట్టె, ప్లేట్లు,గ్లాసులు, బెడ్‌షిట్లు, కార్పెట్లు, టర్కీ టవళ్ళు, స్వెట్టర్లు, రెండు నైట్ డ్రస్సులు షూలు,సాక్సె ఇవ్వడం అబినందనీయమని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అదిరోహించాలని వారు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి,విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌కి ,కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది పాల్గోన్నారు.

## పేద విద్యార్థులకు సౌకర్యాల కల్పనే లక్ష్యం



**కోట,జులై 19 ప్రభాతవార్త :** పేద విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎన్నో అభివృద్ది కార్యక్రమాలు చేపడుతోందని మాజీ మండలా ధ్యక్షులు నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం కోటలోని ఎస్‌సీ బాలికల వసతి గృహంలో మేట్రిన్ ఉషారాణీ అధ్వర్యంలో విద్యార్దునులకు విద్యా సమాగ్రి పంపిణీ చేసే కార్యక్రమంలో వినోద్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యాబివృద్దికి మంత్రి లోకేశ్ అత్యధిక నిధులు కేటాయిస్తూ పేద విద్యార్దుల ఉత్తమ భవిష్యత్తుకు కృషి చేస్తున్నారని కొనియాడారు.వసతి గృహంలో మంచినీరు బోరు కావాలని,విద్యార్దనులు కిలోమీటరు దూరంలో ఉన్న స్కూల్‌లో నడిచి పోవాలంటే కొంత కష్టంగా ఉందిని మెట్రిన్ ఉషారాణి వినోద్‌రెడ్డికి వివరించారు.తాను శాసన సభ్యులు సునిల్‌కుమార్‌తో మాట్లాడి సమస్యలను పరిష్కారిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ‌ఎస్‌డబ్ల్యు మనోజ్, తెదేపా మండల అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డి, తెదేపా మాజీ మడల కన్వీనర్ మద్దాలి సర్వోత్తమ్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## అల్లిపురం టిడ్కో కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్

– సరైన పత్రాలు లేని 19 వాహనాలు స్వాధీనం



**నెల్లూరు క్రైమ్, జూలై 19, ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లిపురం టిడ్కో హౌసింగ్ కాలనీలో ఆదివారం రూరల్ పోలీసుల పోలీసుల బృందం విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఉదయం 5:30 గంటల నుండి 7:30 గంటల వరకు జరిగిన ఈ ఆకస్మిక తనిఖీలో రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి వేణు నేతృత్వంలో ఇద్దరు ఎస్సైలు, 20 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాలనీలోని నివాసాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు, సరైన పత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో భాగంగా, ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, మాదకద్రవ్యాల నివారణ మరియు మహిళా భద్రతపై పోలీసులు దిశానిర్దేశం చేశారు. తమ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని సీఐ స్పష్టం చేశారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**నెల్లూరు క్రైమ్, జూలై 19, ప్రభాతవార్త:** రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని సౌత్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం తెల్లవారుజాము చోటుచేసుకుంది. మృతుడికి 40 –45 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, బూడిద రంగు ఆఫ్ హాండ్స్ షర్ట, వైట్ కట్బనియన్, నలుపు రంగు ప్యాంటు ధరించిన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించడానికి మృతుని వద్ద ఎటువంటి ఆనవాళ్లు లభించలేదని తెలిపారు. డ్యూటీ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## సీపీఎం పేరు వాడి దందాలు చేస్తే కఠిన చర్యలు

– బహిష్కరించిన మాజీ నాయకులపై పార్టీ ఘాటు హెచ్చరిక



**తోటపల్లి గూడూరు, జూలై 19, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లి గూడూరు మండలం నరుకూరులో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సామాజిక శంఖారావం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పార్టీ నాయకులు మాజీ నాయకుల కార్యకలాపాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి లక్ష్మయ్య, కమిటీ సభ్యుడు రాజా మాట్లాడుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, దందాలు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌లకు పాల్పడుతున్న మాజీ మండల కార్యదర్శి వెంకయ్యతో పాటు కమిటీ సభ్యులు రమణమ్మ, సీనయ్య, వెంకటసుబ్బయ్యలను ఇప్పటికే సీపీఎం పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. అయినప్పటికీ వారు పార్టీ పేరు, బ్యానర్లు, లెటర్‌ప్యాడ్లను దుర్వినియోగం చేస్తూ లేఅవుట్లు, పీజీఆర్ఎస్ అర్జీలు, ఫిర్యాదుల పేరుతో ప్రజలను, ప్రజాప్రతినిధులను బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటీవల వరిగొండ జ్వాలాముఖి ఆలయం చైర్మన్‌కు సంబంధించిన స్కానర్ ఖాతా అంశాన్ని వ్యక్తిగత కక్షతో వక్రీకరిస్తూ భక్తులను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు గౌరవప్రదమైన వ్యక్తులపై అసత్య ఆరోపణలు చేసి బురదజల్లే ప్రయత్నాలు చేయడం పూర్తిగా ఖండనీయమని పేర్కొన్నారు. పార్టీ నుంచి బహిష్కరించబడిన వ్యక్తులు చేస్తున్న ఆరోపణలకు సీపీఎం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, వారి చర్యలను పార్టీ ఏమాత్రం సమర్థించదని స్పష్టం చేశారు. పార్టీ నుంచి తొలగించబడిన వారి మాటలను ప్రజలు నమ్మవద్దని, వారి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు, బెదిరింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఎం పార్టీ నిర్ణయాలు జిల్లా కమిటీ, మండల కమిటీ ఆధ్వర్యంలోనే అమలవుతాయని, ఎవరైనా పార్టీ పేరు, జెండా, బ్యానర్లు, లెటర్‌ప్యాడ్లను దుర్వినియోగం చేస్తే చట్టపరంగా, పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సెక్రెటేరియట్ సభ్యుడు మోహన్‌రావు, జిల్లా కమిటీ సభ్యురాలు అన్నపూర్ణమ్మ, బండి శౌరి తదితరులు పాల్గొన్నారు.

## జనవిజ్ఞాన వేదిక సర్వతోముఖాభివృద్ధికి కమిటీలు



**కావలి, జులై 19 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని రవి నర్సింగ్‌హోమ్‌లో స్థానిక జనవి జ్ఞాన వేదిక అధ్యక్షులు తోట వెంటకేశ్వర్లు ఆధ్వర్య ంలో ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది .ఈ సమావేశంలో జెవివి సేవలను వివిధ రంగా ల్లో విస్తరింపచేసేందుకు కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది, ముఖ్య అతిధులుగా చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.మన ోహర్ బాబు, ఈఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ సి.విజయభాస్కర్‌రావు, డాక్టర్ శివప్రసాద్‌లు పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత సమాజాన్ని మూడనమ్మకాలు పట్టి పీడిస్తున్నాయని వాటిని ఏ విధంగా పారద్రోలాలి సామాన్య ప్రజలకు ఏ విధంగా అర్థం చేయాలి, సమాజంలో వివిధ రంగాల్లో పలు సేవలను జెవివి కమిటీల్లో ఏ విధంగా ఉపయోగించి,సమాజ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలో విశదీకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరినాథ్, కోశాధికారి టి.సుబ్బరామశర్మ, ఏఎంసి డైరెక్టర్ కొప్పులక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు పాపిశెట్టి జానకిరామ్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు జి.కళ్యాణి, పట్టణ ఉపాధ్యక్షులు కందికట్టు నారాయణ, ఎస్.కె.ఖాదర్‌బాష, కె.హరినారపురెడ్డి, శ్రీకర్ల వెంకయ్య, సి.కల్లయ్య, జెవివి కార్యదర్శులు, యూటిఎఫ్ నాయకులు, కార్యవర్గ సభ్యులు, జెవివి.సభ్యులు పాల్గొన్నారు.

## నలంద పాఠశాలలో ఘనంగా బ్యాంకు నేషనలైజేషన్ డే



**కావలి, జులై 19 ప్రభాతవార్త :** కావలి గాయత్రినగర్‌లోని నలంద పాఠశాలలో 58వ బ్యాంకు నేషనలైజేషన్ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిండికేట్ పెన్షనర్స్ రిటైర్డు అసోసియేషన్‌చే పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా కెనరాబ్యాంకు నెల్లూరు రీజనల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్ వర్మ పాల్గొన్నారు. నలంద విద్యాసంస్థల ఛైర్మెన్ ఎండి మజహర్, ప్రిన్సిపాల్ రాణి, పి.మోహన్‌ల సహకారంతోఎంతో ఘనంగా నిర్వహించారు.ఎం.జోషిత,ఎస్.భరత్‌కుమార్, ఎం.ప్రీతంసాయికుమార్, రాజేష్‌కుమార్, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని వ్యక్తి మృతి



**వింజమూరు(వరికుంటపాడు), జూలై 19, ప్రభాతవార్త :** వరికుంటపాడు మండలం జడదేవి గ్రామ సమీపంలోని 565 జాతీయ రహదారిపక్కన ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. జడ దేవి గ్రామానికి చెందిన ఏనుగంటి కొండయ్య (65) ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పరిశీలి ంచారు. అయితే అప్పటికే కొండయ్య మృతి చెందినట్లు 108 సిబ్బంది నిర్ధారించారు. స్థానికుల సమాచారం మేరకు, కొండయ్య కొంతకాలంగా ఆరోగ్య సమస్యలు, మానసిక ఇబ్బందులతో బాధపడుతూఉన్నట్లు, పలు ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నారని తెలిపారు. మృతునికి భార్య ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

## మేడం మా హాస్టల్‌కు రండి

– చైర్ పర్సన్‌కి విద్యార్థుల వినతి



**వింజమూరు, జూలై 19, ప్రభాతవార్త :** గ్రంథాలయ సందర్శనలో భాగంగా వింజ మూరుకు వచ్చిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మేకపాటి శాంతికుమారిని ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులు కలిశారు. హాస్టల్‌ను ఒకసారి సందర్శించాలని కోరగా, ఆమె విద్యార్థులతో కలిసి హాస్టల్‌కువెళ్లారు.సౌకర్యాల గురించి వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి బాగా చదివి తల్లిదండ్రులకు, ప్రాంతానికి పేరు తీసుకురావాలని సూచించారు. మెనూ ప్రకారం అన్ని అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సా రెడ్డి మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు బిజెపి నాయకులు దేగా మధు యాదవ్ ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు

## వసతి గృహ విద్యార్థులకు సామాగ్రిని పంపిణీ



**వింజమూరు, జూలై 19, ప్రభాతవార్త:** పేద విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని మండల టీడీపీ అధ్యక్షులు గూడ నర్సా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన వింజమూరులోని ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన దుప్పట్లు, ఇతర సామాగ్రిని ఏఎస్‌డబ్ల్యు గీతాదేవితో కలసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎస్సీ బాలికల వసతి గృహంలోని 86 మంది విద్యార్థినులకు, 52 మంది బాలికలకు దుప్పట్లు అందజేశారు. ప్రతి విద్యార్థికి రెండు జతల బట్టలు, టవల్, స్వెటర్, బూట్లు తదితర నిత్యావసరాలను కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షరాలు వనిపెంట హైమావతి మండల కన్వీనర్ గూడ నర్సా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్య, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేస్తోందన్నారు. పేద విద్యార్థులు కూడా కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు పొందాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ సామాగ్రిని అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు గురజాల గోపి మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాజీ పట్టణ అధ్యక్షులు ఎం. శ్రీనివాసులు నాయుడు, సంక్షేమ శాఖ అధికారి పి. భారతి, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీఎంఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా లెక్కమనేని ఎన్నిక



**వింజమూరు, జూలై 19, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఎఫ్) ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు లెక్కమనేని రాజేష్ నాయుడు ఎన్నిక కావడం జర్నలిస్టు వర్గాల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. ఆదివారం నెల్లూరులో నిర్వహించిన ఏపీఎంఎఫ్ జిల్లా మహాసభల్లో వ్యవస్థాపక అధ్యక్షుడు ఢిల్లీ బాబు రెడ్డి ఆధ్వర్యంలో ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లెక్కమనేని రాజేష్ నాయుడు మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. జిల్లా కమిటీ, ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు యూనియన్ చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటానని చెప్పారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని, యూనియన్ నియమ నిబంధనలకు కట్టుబడి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఆయన స్పష్టం చేశారు. రాజేష్ నాయుడు నియామకంపై ఉదయగిరి నియోజకవర్గంలోని పలువురు జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. కొత్త నాయకత్వంలో జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కోడిపందాల స్థావరాలపై దాడులు



**ఆత్మకూరు,జులై 19, ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలం పడకండ్ల గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరంపై ఆదివారం ఆత్మకూరు ఎస్ఐ జంపాని కుమార్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. తమకు వచ్చిన సమాచారం మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుండి మూడు కోళ్ళు, 7,140రూపాయల నగదు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు మండలంలో పేకాట , కోడిపందాలు లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై పోలీసులు కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈప్రాంతంలో ఏవైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ జంపాని కుమార్ తెలిపారు.

## సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు అవసరమైన సామాగ్రి పంపిణీ



**చేజర్ల, జులై 19, ప్రభాతవార్త :** సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో నివసిస్తూ విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన విద్యా, వ్యక్తిగత సంరక్షణ, వసతి సామాగ్రిని అందజేసింది. నెల్లూరు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ కే.శోభారాణి ఆదేశాల మేరకు చేజర్ల సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఆదివారం విద్యార్థులకు ఈ సామాగ్రిని పంపిణీ చేశారు. హాస్టల్ వార్డెన్ ఎం.సుధాకరయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రతి విద్యార్థికి ఒక స్టీల్ ప్లేట్, ఒక స్టీల్ గ్లాస్, ఒక స్టీల్ కప్పు, ఒక రగ్ రెండు జతల నైట్ డ్రస్సులు, ఒక స్వెటర్ , ఒక టర్కీ టవల్, ఒక జత షూస్‌ను అందజేశారు. విద్యార్థుల దైనందిన అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సామాగ్రిని అందించడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మండల సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు రావి పెంచలరెడ్డి, రావి లక్ష్మీనర్సా రెడ్డి పాల్గొని విద్యార్థులకు సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి, పరిశుభ్రమైన తాగునీరు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని, వారి యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించటం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విడవలూరులో ప్రజా సమస్యల వేదిక



**విడవలూరు, జులై 19 ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా సమస్యల ప్రజా వేదిక' కార్యక్రమం సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఏ. లక్ష్మీ మ్రపసన్న ఒక ప్రకటనలో తెలిపారు.భూ సమస్యలు, ప్రభుత్వ పథకాలు, రేషన్ కార్డులు, సామాజిక పింఛన్లు తదితర అంశాలకు సంబంధించి మండల ప్రజలు తమ వినతులను సంబంధిత ఆధార పత్రాలతో సమర్పించాలని ఆమె సూచించారు. ప్రజల నుంచి అం దిన ఫిర్యాదులను పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా సమస్య లను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ వేదికను మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

## ప్రైవేటు పెత్తనం.. అధికారుల మౌనం!

:నిబంధనలను తుంగలో తొక్కిన విడవలూరు తహశీల్దార్ కార్యాలయం

**విడవలూరు, జులై 19ప్రభాతవార్త:** ప్రభుత్వ కార్యాలయాల్లోకి అనధికారిక వ్యక్తుల ప్రవేశం లేదని నిబంధనలు ఘోషిస్తున్నా, విడవలూరు తహశీల్దార్ కార్యాలయంలో మాత్రం ప్రైవేటు వ్యక్తుల పెత్తనం యథేచ్ఛగా సాగుతోంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతులకు సదరు ప్రైవేటు వ్యక్తులు చుక్కలు చూపిస్తున్నా, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదిన్నర క్రితమే ఫిర్యాదు.అందని ఫలితందాదాపు ఏడాదిన్నర క్రితం, విడవలూరు ఎంఆర్‌ఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్ వల్ల రైతులకు జరుగుతున్న ఇబ్బందులపై స్థానిక రైతులు జిల్లా కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. రైతులకు ఫోన్లు చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడనే ఆరోపణలు రావడంతో, స్పందించిన కలెక్టర్ అప్పటి కావలి ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణను విచారణకు ఆదేశించారు. మరుసటి రోజే కార్యాలయానికి చేరుకున్న ఆర్డీఓ, ప్రైవేటు వ్యక్తిని వెంటనే తొలగి ంచాలని, ఆ పనులను జూనియర్ అసిస్టెంట్లకు అప్పగించాలని తహశీల్దార్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఉన్నతాధికారుల ఆదేశాలకు తహశీల్దార్ తూట్లుఆర్డీఓ ఆదేశాలను బేఖాతరు చేసిన నాటి తహశీల్దార్,సదరు వ్యక్తిని తొలగించకపోగా,కార్యాలయంలోనే కొనసాగించి ఆదాయాన్ని గడించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కొత్త తహశీల్దార్ బాధ్యతలు స్వీకరించాక, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సదరు ప్రైవేటు వ్యక్తిని విధుల నుంచి తొలగించారు.ప్రభావం చూపుతున్న ప్రైవేటు గతంతొలగించబడిన సదరు వ్యక్తిది బుచ్చిరెడ్డిపాలెం మండలం కాగా, విడవలూరు మండలం రామతీర్థంలో వివాహం చేసుకున్నాడు. దీనితో క్షేత్రస్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు, రాజకీయ నాయకుల వరకు తన వల విస్తరించి, భూ సమస్యల వ్యవహారాల్లో చక్రం తిప్పుతుంటాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. తనను తొలగించినా, మళ్ళీ ఎలాగైనా కార్యాలయంలోకి రావాలనే వ్యూహంతో.తానెంతో నిజాయితీ పరుడినని, జీతం అక్కర్లేదని, ఉచితంగానే పనిచేస్తానని కార్యాలయాల చుట్టూ తిరుగుతుండటం గమనార్హం. అంతేకాకుండా, తనపై వేటు పడటం అన్యాయమంటూ జిల్లా అధికారులకు కూడా ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.ప్రభుత్వ కార్యాల యాల్లో గోప్యతను కాపాడాల్సి న చోట, ఇలాంటి వ్యక్తులకు తావు ఇవ్వడం వల్ల ఫైళ్లు మాయమవ్వడం, కీలక సమాచారం బయటకు వెళ్లడం వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, కార్యాలయాల్లో అనధికారిక వ్యక్తుల ప్రవేశాన్ని పూర్తిగా అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గౌడ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి



**కోట, జూలై 19 ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలో గౌడ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధి. ంచాలని జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తిరకాల శీనయ్య గౌడ్ అన్నారు. ఆదివారం కోటలోని ఎఎన్ ఆర్ ఫంక్షన్ హాల్లో గౌడ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల, జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపే నాయకులు ఇక్కడి నుంచే ఎదగాలని, యువత అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని కోరారు. తాటి, ఈత, కొబ్బరి వృక్షాల కోసం పామ్‌బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో పది లక్షల తాటి చెట్లను నాటడం, పర్యావరణాన్ని పరిరక్షించడం చేస్తామన్నారు. అలాగే కల్లుగీత కార్మికుల నుదుట గీతలు మారాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు ఓట్ల సమయంలో హామీలిస్తున్నారే తప్ప ఆ తర్వాత గీత కార్మికుల సంక్షేమాన్ని గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. గ్రామాల్లో సొసైటీల ఏర్పాటుతో పాటు సొసైటీ భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దయాకర్ గౌడ్, చక్రపాణి గౌడ్, రమేష్ గౌడ్, నరమాల వెంకటరమణయ్య గౌడ్, రాధాకృష్ణ గౌడ్, శ్రీనివాస గౌడ్, దాసరి రాజేంద్ర గౌడ్, బాలయ్య గౌడ్, భాస్కర్ గౌడ్, రాజారావు గౌడ్, మధు గౌడ్, శ్రీనివాస గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుడి భూమి ఆక్రమణపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు

**చేజర్ల, జులై 19, ప్రభాతవార్త :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చేజర్ల మండలం నెర్నూరు గ్రామ రెవెన్యూ పరిధిలో మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించిన అసైన్‌మెంట్ భూములను రాజకీయ పలుకుబడితో వైకాపా నాయకుడు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ మాజీ సైనికుడు మన్నెం అమరనాథ్‌రెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఇటీవల వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం తనతో పాటు మరో నలుగురు మాజీ సైనికులకు నెర్నూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఒక్కొక్కరికి సుమారు ఐదు ఎకరాల చొప్పున అసైన్‌మెంట్ భూములను ప్రభుత్వం కేటాయించిందని, తాము ఎన్నో సంవత్సరాలుగా ఆ భూములను సాగు చేసుకుంటూ వచ్చామని తెలిపారు. అయితే గత ప్రభుత్వ హయాంలో కొల్లపనాయుడుపల్లె గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని ఐదుగురు వ్యక్తులు అసైన్‌మెంట్ కమిటీ అనుమతి లేకుండానే నకిలీ సంతకాలు చేసి, రెవెన్యూ రికార్డులను మార్ఫింగ్ చేసి వన్ బి, అడంగల్‌లో తమ పేర్ల మీద భూములను మార్చుకున్నారని ఆరోపించారు. అనంతరం తమను ఆ భూముల్లోకి వెళ్లనీయకుండా దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఖాతా నెంబర్.. 262, సర్వే నెంబర్ 554/3. విస్తీర్ణం 4.95 సెంట్లు భూమి, ఖాతా నెంబర్.. 500051, సర్వే నెంబర్ 553/3 విస్తీర్ణం.. 5.16 సెంట్లు భూమి. ఖాతా నెంబర్ 131, సర్వే నెంబర్ 554/2 విస్తీర్ణం 4.90 సెంట్లు భూమి. ఖాతా నెంబర్ 404 సర్వే నంబర్ 554/2. విస్తీర్ణం 4.95 సెంట్లు భూమి. ఖాతా నెంబర్ 425.. సర్వే నెంబర్ 554/4 విస్తీర్ణం 4.95 సెంట్లు భూమిని సుమారు 25 ఎకరాల భూమిని ఒకే కుటుంబానికి చెందిన పలువురు వ్యక్తుల పేర్లపై అక్రమంగా నమోదు చేసి అనుభవిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం నెర్నూరు గ్రామంలో రీ– సర్వే పక్రియ కూడా పూర్తయింది. పారదర్శకంగా విచారణ జరిపి అసలు హక్కుదారులకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు. అసైన్‌మెంట్ భూముల రికార్డులను సమగ్రంగా పరిశీలించి, అక్రమాలు జరిగి ఉంటే వాటిని రద్దు చేసి తమకు చెందిన భూములను తిరిగి అప్పగించాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. కాగా వైకాపా నాయకుడు, ఆయన కుటుంబ సభ్యులు ఆక్రమించిన 25 ఎకరాల విలువ సుమారు రెండున్నర కోట్ల రూపాయలు ఉంటుందని తెలిసింది. ఇంత విలువైన భూమిని ఆక్రమించుకొని అసైన్‌మెంట్ కమిటీలో పెట్టకుండా ఈ భూమిని వారి పేర్లు మీద నమోదు చేసుకున్నట్లు సమాచారం. అసైన్‌మెంట్ కమిటీలలో ఆమోదం లేకుండా కుటుంబంలో అందరికి తలా 5 ఎకరాల భూమిని కేటాయించడం నిబంధనలకు విరుద్ధం. దీనిపై రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాల్సి న అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై తహసీల్దార్ మస్తానయ్యను ఆదివారం ప్రభాతవార్త వివరణ కోరగా.. తమ దృష్టికి ఇంత వరకు ఈ విషయం రాలేదని విచారించి చర్యలు తీసుకుంటామని ఆయన బదులిచ్చారు.

## గ్రీవెన్స్ డేకు అన్ని శాఖల అధికారులు హాజరు తప్పనిసరి



**కోవూరు, జూలై 19ప్రభాతవార్త :** కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే గ్రీవెన్స్‌డేకు మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వారానికి ఒక పర్యాయం నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరైతేనే సమస్యల పరిష్కారానికి వేదికగా మారుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి అధికారి హాజరు కావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## ఉన్నత లక్ష్యాలతో చదవండి ఉన్నతశిఖరాలు అదిరోహించండి



**బుచ్చి జూలై 19 ప్రభాతవార్త :** ప్రభుత్వం పేద విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పించి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకొని వెళ్ళిలని కృషి చేస్తుందని దళితనాయకులు సూదల రమణయ్య పేర్కున్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్‌సి బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణి చేసిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గోన్నారు.ఈకార్యక్రమంలో రమణయ్య మాట్లాడుతు హాస్టల్స్‌లో చదువుకున్న అనేక మంది నేడు ఉన్నత స్ధాయిలో మంచి మంచి ఉద్యోగాలలో ఉన్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్పోరేట్ స్కూల్స్‌కి,కళాశాలలకు మిన్నగా పౌష్టికాహారంతో కూడిన బోజనం, విద్యార్థులకు డ్రస్సులు ఇస్తుంది. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సమాజంలో ఉత్తమ పౌరులుగా గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు.ఈ హాస్టల్‌ను చూస్తుంటే ప్రభుత్వ హాస్టలా లేక కార్పోరేట్ హాస్టలా అన్న సందేహం వస్తుందని అంతబాగుందని అన్నారు.ఇటీవల ఈ హాస్టల్ ను పరిశీలించిన రాష్ట్ర ఫుడ్ కార్పోరేషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి వార్డన్ నాగరాజు పనితానాన్ని చూసి సన్మానించారని ఇది మంచి శుభపరిణామమని అన్నారు. విద్యార్థులందరు బాగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేశారు.అనంతరం సీనియర్‌నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డిని , దళితనేత సూదల రమణయ్యను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో రిటైడ్ ఉపాధ్యాయులు పుల్లయ్య,రిటైడ్ ఉపాధ్యాయులు రఘునంధనరావు, అవార్డు రత్న గండికోట సుధీర్‌కుమార్, రిటైడ్ పోస్టు మాస్టర్ రామయ్య, విద్యార్థులు,హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## గంగమ్మ తల్లిని దర్శించి ప్రత్యేక పూజలు చేస్తున్న శాంతి కుమారి



**వింజమూరు, జూలై 19, ప్రభా తవార్త** వింజమూరు మండలం గుండె మడగల గ్రామంలో వేం చేసియున్న శ్రీ గంగమ్మ తల్లి అమ్మవారిని ఆదివారం జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్పర్సన్ మేక పాటి శాంతి కుమారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో పూజలు చేయగా ఆమె గ్రామ ప్రజల సుఖ సంతోషాలు కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బుర్రాల శ్రీనివాసులుయాదవ్, గ్రామ ప్రజలు ఆమెకు పూర్ణ కుంభంతో సాదర స్వాగతం పలికి శాలవాతో సత్కరించారు. గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ముఖ్యంగా గ్రామ గ్రంథాలయాన్ని మరింతగా ఆధునికరించి విద్యార్థు లకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటానని మేకపాలు శాంతి కుమారి హామీ ఇచ్చారు. గ్రామస్తులు తన భర్త మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి తన చూపుతున్న ప్రేమ అభిమానాలకు తాము ఎప్పుడు ఉంటామని ఆమెతెలిపారు. ఈ కార్యక్రమంలో మీసాల నాగయ్య, ఉప్పుటూరి కొండయ్య, చవలపెదపెంచలయ్య, నల్లగొర్ల పుల్లయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.









## నాలుగు షైనింగ్ స్టార్లు సాధించిన శ్రీ వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు



**బుచ్చి జూలై 19 ప్రభాతవార్త** 2026 షైనింగ్ స్టార్ల అవార్డులలో బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీ వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ కి చెందిన నలుగురు విద్యార్థులు అవార్డులు సాధించారు .ఈ సందర్బంగా కరస్పాండెంట్ రామ సుబ్బారెడ్డి విద్యార్థులను అభినందించారు. నలుగురు విద్యార్థులు తమ పాఠశాల నుండి షైనింగ్‌స్టార్లు సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. వారికి జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రం,నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. తమ బిడ్డలు షైనింగ్ స్టార్లు సాధించడంపట్ల విద్యార్థులతల్లి దండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. షైనింగ్ స్టార్లు సాధించిన విద్యార్థులు జి.గీతామృత 594,ఎం.వంశీకృష్ణా 594, కె.చైత్ర హాసినీ 593, డి. వెంకట గౌతమి 579 మార్కులు తెచ్చుకొని షైనింగ్ స్టార్లుగా నిలిచారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### - ఏపిఎంఎఫ్ జిల్లా మహాసభలో పాల్గొన్న మంత్రి నారాయణ



**నెల్లూరు, జూలై 19, ప్రభాతవార్త – వైద్యం** జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. నెల్లూరులో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ఏపిఎంఎఫ్ జిల్లా మహాసభల్లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మం త్రికి ఫౌండర్ దిల్లిబాబురెడ్డి, సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియా సమాజానికి దిశా నిర్దేశం చేస్తుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. గతంలో ఉన్న అక్రిడిటేషన్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ వివక్ష లేకుండా కొత్త అక్రిడిటేషన్ విధానాన్ని తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. అలాగే జర్నలిస్టుల కుటుంబాలకు హెల్త్ స్కీమ్ కింద నిరంతరాయ నగదు రహిత వైద్యం, అర్హులైన వారికి ఇళ్ల లేదా ఇంటి స్థలాల కేటాయింపును ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. నిజాయితీ, సామాజిక బాధ్యతతో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వంమీడియా కలిసి పనిచేస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ నందన్, జర్నలిస్ట్ యూనియన్ నేతలు నరసింహులు, మల్లికార్జున, వెంకట్ నారాయణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గౌడ సంక్షేమ సంఘం ఎన్నిక

**కోట, జూలై 19 ప్రభాతవార్త** కోట మండల గౌడ సంక్షేమ సంఘాన్ని ఆదివారం స్థానిక ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్లా సురేష్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మస్తాన్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా శివకుమార్ గౌడ్, కార్యదర్శిగా వెంకయ్య గౌడ్, సహాయ కార్యదర్శిగా కృష్ణ, వ్యవస్థాపక కార్యదర్శిగా శ్రీనివాసులు గౌడ్, ప్రధాన కార్యదర్శి శివశంకర గౌడ్, యువజన సంఘం కార్యదర్శిగా హరికృష్ణ గౌడ్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు తిరకాల శీనయ్య గౌడ్ తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట

### - టిడిపి నాయకుడు జలీల్ అహ్మద్



**కోట, జూలై 19 ప్రభాతవార్త** విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని నెల్లూరు జిల్లా తెలు గుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్‌అహ్మద్ అన్నారు. ఆది వారం కోటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో మెట్రీన్ ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం లో ఆయన ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్ అని, తల్లిదండ్రులు, ప్రభుత్వం విద్యార్థులపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుని విద్య ద్వా రా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వి నియోగం చేసుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. 160 మంది విద్యార్థినులకు అవసరమైన మెటీరియల్స్ జలీల్ ఆహ్మద్ పంపిణీ చేశారు. 22న తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు చొప్పున ప్రభుత్వం జమ చేస్తుం దన్నా రు. రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ మంత్రి పదవిని సీఎం చంద్రబాబునాయుడిని మరీమరీ అడిగి తీసుకున్నారని చెప్పారు. విద్యారంగంలో మంచి సంస్కరణలు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు.డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకంను మరింత నాణ్యితగా అమలు చేస్తున్నారని చెప్పారు. పోషకాలతో కూడిన ఆహారం ఉంటేనే విద్యార్థులు ఆరోగ్యంగా బాగ చదువుకొంటారని పేర్కొన్నారు.వసతి గృహంలో మం చినీరు బోరు కావాలని మెట్రీన్ ఉషారాణి జలీల్ ఆహ్మద్‌ను కొరగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ దృష్టికి తీసు కొని బోరు మంజూరు చేయిస్తామని చెప్పారు.థ్యాంకూ సీఎం సార్ అంటూ ప్లకార్డులేను విద్యార్ధునులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జలసంఘం నెల్లూరు మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, మధుయాదవ్,సిద్ధపరెడ్డి పోలమ్మ,మెట్రీన్ ఉషారాణి, ఎఎస్‌డబ్ల్యు మనోజ్ పాల్గొన్నారు.

## జంగమ సేవా సంఘం నేతల ఆత్మీయ సమావేశం



**నెల్లూరు, జులై 19, ప్రభాతవార్త– విద్య** జంగమ సేవా సంఘం గ్రామ, మండల,జిల్లాస్థాయి నేతల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నగరంలోని స్థానిక మూలాపేట వీరశైవ కళ్యాణ మండపంలో చైర్మన్ పేట శ్రీనివాసులు, చిన్న పిల్లల వైద్యులు తెనాలి రవికుమార్, విశ్రాంత మైనింగ్ ఇన్స్పెక్టర్ వ్యవస్థాపక అధ్యక్షులు గంధవళ్ల దశరథ రామయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతు జంగమ కులస్తులు అన్నీ రంగాల్లో రాణించాలని కోరారు. విద్య,వైద్యం, ఉపాధి, రాజకీయాలో ఇలా అన్నింటిలో అందరూ ముందు వరుసలో ఉండాలన్నారు. గతంలో అనేకమంది నేతలు తమ కులం లోని వారి కోసం అహర్నిశలు కష్టపడ్డారని, వారిని ఆదర్శంగా తీసుకుని మరింత ఎక్కువగా సేవా కార్యక్ర మాలు చేపట్టాలన్నారు. ఇటీవల గంగపట్నంలో వందలమంది కుల సభ్యులతో ఏర్పాటుచేసిన వనబో జనాల కార్యక్రమం ఘనవిజయం చేసేందకు కృషిచేసిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగేజంగమ కులస్తులు అధికంగా ఉండే మూలాపేటలో నూతన కళ్యాణ మండ పాన్ని దాతల సహకారంతో , తన సొంత నిదులు రూ.11 లక్షలు వెచ్చించి పూర్తిచేసిన పూల శీనయ్య ఆధర్శప్రాయులని కొనియాడారు. రానున్న రోజుల్లో జంగమ కుల ప్రజలకు అన్నీ విధాల అభివృద్ధికి పాటు పడాలని తీర్మానించారు. అనంతరం రవి చిన్నపిల్లల వైద్య నిపుణులు రవికు మార్‌ని, అసోసియేషన్ నాయకులు గంధవళ్ల దశరధ రామయ్యను సభ్యులు ఘ నంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేజర్ల మహేష్, అమర్‌లింగం, విజయధుర్గ, ఉమా శంకర్, రమేష్, ఉమా శంకర్, సర్వేపల్లి నాగరాజు, కిన్నెర సుబ్ర హ్మణ్యం, కోటేశ్వరయ్య, చంద్రశేఖర్య, పాల్గొన్నారు.

## మహిళల పట్ల ఆంధ్రాలో - ఆటవిక రాజ్యం

### - రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి



**నెల్లూరు, జూలై 19, ప్రభాతవార్త – వైద్యం** మహిళల పట్ల ఆంధ్రాలో ఆటవిక రాజ్యం నడుస్తోందని రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కావలి సంఘటన మరువక ముందే గుంటూరు నగరంలో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ మాత్రమే కాదని, రాష్ట్రంలో శాంతి భద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు దుశ్శాసనుల్లా తయారయ్యారని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల పై దాడులు, అఘాయిత్యాలు విపరీతమై భద్రత, రక్షణ పూర్తిగా కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులు ఏం చేసినా ఈ ప్రభుత్వం తమను రక్షిస్తారనే ధైర్యం ఉందని, రెడ్ బుక్ పాలనలో గ్రామాలు, వార్డులు, డివిజన్ల స్థాయి వరకూ దాడులు విపరీతమైపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి దారుణాలు చేసినా, ముఖ్యంగా మహిళలపై దాడి చేసినా, వారిని అవమానించినా, వేధించినా తమకు ఏమీ కాదని, తమను కాపాడ్డానికి చంద్రబాబు ఉన్నారనే ధైర్యం పెరిగిపోయిందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర హోమ్ మినిస్టర్ అనిత పదవి కేవలం అలంకరణకా లేక ప్రతిపక్షాలను విమర్శించడానికే పరిమితమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మహిళలపై దాడులు, బాధితుల ఆవేదనలన్నింటిని గాలికొదిలేసి ప్రజాస్వామ్య బాధ్యతలను మర్చిపోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. హోమ్ మినిస్టర్ ప్రజల సమస్యలపై స్పందన లేకుండా రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఇదేనా మీరు చెప్పే మహిళా భద్ర చంద్రబాబు, ఇదేనా సుపరిపాలన అని ప్రశ్నించారు. కూటమి పాలనలో చట్టాలు కొందరికి వర్తించవు అనే సూక్తి నడుస్తోందని, రాష్ట్రంలో రూల్ ఆఫ్ ఫియర్ నడుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం వరకూ ప్రతి ఇంట్లోనూ విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం గురించి చర్చ జరిగేదని, నేడు ప్రతి ఇంట్లోనూ రెడ్ బుక్ రాజ్యాంగం, లాకప్ డెత్, సూపర్ 6 మోసాలు, టాపిక్ డైవర్షన్ పాలిటిక్స్‌పై చర్చ జరుగుతోందని అవహేళన చేశారు. ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికి మహిళల ఆగ్రహమే ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజులు వస్తాయని హెచ్చరించారు.

## నేడు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం



**నెల్లూరు, జూలై 19, ప్రభాతవార్త – వైద్యం** నెల్లూరు విద్యుత్ భవన్‌లో ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు 0861–2320427 నెంబర్‌లో నిర్వహించబడుతుందని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.రాఘవేంద్రం తెలిపారు. అలాగే, ఏపిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ప్రతి సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ సిఎండీ కార్యక్రమాన్ని ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 12.30 వరకు 8977716661 నెంబర్‌లో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ సంబంధిత సమస్యలు, సూచనలు నేరుగా తెలియజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ రాఘవేంద్రం కోరారు.

## ఎఇఇ పోస్టుల నియామక దరఖాస్తులకు నేడే ఆఖరు

### - ఆగష్టు 22 నుంచి 29వరకు రాత పరీక్షలు

### - ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి



**నెల్లూరు, జులై 19, ప్రభాతవార్త – వైద్యం** రాష్ట్రంలో ఎపిట్రాన్స్కో, ఎపి జెన్కో, ఎపిఎస్పిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్, ఎపిసిపిడిసిఎల్ సంస్థల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల నియామకాలకై అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎపి ట్రాన్స్కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 16, టెలికామ్ 10, సివిల్ ఇంజనీర్లు 23మొత్తం కలిపి 200, ఎపిజెన్కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 52, మెకానికల్ 21, ఎలక్ట్రానిక్స్ 7,సివిల్ ఇంజనీర్లు 20 మొత్తంకలిపి 100, ఎపిఎస్పి డిసిఎల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 125, టెలికామ్ 4,సివిల్ ఇంజనీర్లు 6 మొత్తం కలిపి 135, ఎపిఇపిడిసిఎల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 128, టెలికామ్ 3, సివిల్ ఇంజనీర్లు 4 మొత్తం కలిపి 135, ఎపిసిపిడిసిఎల్లో ఎలక్ట్రి కల్ ఇంజనీర్లు 56, టెలికామ్ 1, సివిల్ ఇంజనీర్లు 3 మొత్తం కలిపి 60 పోస్టుల నియామకానికి ఆయా సంస్థలు ప్రకటనను జారీ చేయడం జరిగిందన్నారు. నియామక ప్రకటనలో పేర్కొన్న షెడ్యూల్ మేరకే ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని, ఈ నెల 20వ తేదీ సాయంత్రంలోగా అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. షెడ్యూల్ పేర్కొన్న విధంగానే ఈ యేడాది ఆగష్టు 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని, ఈ షెడ్యూల్ తేదీల్లో ఎటువంటి మార్పు వుండబోదని స్పష్టం చేశారు. ఏఇఇ పోస్టుల నియామక ప్రక్రియ మొత్తాన్ని పార దర్శకంగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు.ఈ ప్రక్రియకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చున్నారు. ఎఇఇ పోస్టుల నియామక అంశంలో అభ్యర్థులు దళారుల మాటలు, ఇతర అనధికారిక సామాజిక మాధ్యమాల ద్వారా వెలువడే సమాచారాన్ని నమ్మి మోసపోవద్దని సూచించారు.

## అరాచకపాలనకు స్వస్తి పలకాలి

### - కార్యకర్తల కోసమే 2.0 యాప్



**కోవూరు, జూలై 19ప్రభాతవార్త :** రాష్ట్రంలో అరాచక పాలనను పూర్తిగా అరికట్టేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా తిరిగి వైసీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కోవూరు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు కొండూరు అనిల్‌బాబు అన్నారు. కోవూరులోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నాయ కులతో కలిసి జగన్ 2.0 సూపర్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతుందన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయించడం, జైలుకు పంపడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. కటమి దుర్మార్గాలను ప్రజలకు పూర్తిగా తెలియజేసేందుకే జగన్ 2.0 సూపర్ యాప్‌ను మాజీ ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. ఈ యాప్ ద్వారా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాలు, దుర్మార్గాలను పార్టీ రాష్ట్రం మొత్తం ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఇటీవల ఓ అధికార పార్టీ నాయకులు ఓ మహిళను వివస్త్రను చేసి వీధిలో పరిగెత్తించి దారుణంగా కొట్టిన ఘటన సభ్యసమాజాన్ని చీదరించుకునేలా ఉందన్నారు. ఇటువంటి నీచమైన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. ఏపీఎల్డీఏ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఈ కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఎంతోమంది ముఖ్యమంత్రులు పనిచేసినా ఎప్పుడూ కూడా ఇటువంటి ఆటవిక పాలన చూడలేదన్నారు. ఎవరైనా జరిగిన అన్యాయంపై సోషల్ మీడియాలో పోస్టింగులు పెడితే వాటిని డిలీట్ చేయడం ఈ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు.ఈ రెండేళ్లలో అప్పులమయంగా రాష్ట్రాన్ని మార్చారే తప్ప అభివృద్ధి ఆశించిన మేర శూన్యమన్నారు. ఇప్పటికే ప్రజలు ఈ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ఒక్కొక్కటిగా తెలుసుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ రైతు సంఘం అధ్యక్షుడు నరసింహులురెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, యాక్టివ్ కార్యదర్శి సుబ్బారెడ్డి, రైతు సంఘం కార్యదర్శి మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, శేషగిరిరావు, పార్టీ సీనియర్ నాయకులు శ్యామాచార్యులు, శ్రీనివాసులురెడ్డి, జుబేర్‌బాషా, గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చిరంజీవి,శ్రీనివాసులురెడ్డి, చెంచురెడ్డి, నాయకులు ఉన్నారు.

## వస్తువుల నాణ్యతా ప్రమాణాలు భేష్ ఎమ్మెల్యే కితాబు



**కోవూరు, జూలై 19ప్రభాతవార్త :** కోవూరులోని సాంఘిక సంక్షేమ బాల బాలికల వసతి గృహ సముదాయంలో ఆదివారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వసతి గృహాలకు వచ్చిన వివిధ రకాల మెటీరియల్స్‌ను నిశితంగా పరిశీలించారు. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా విద్యార్థులకు నాణ్యమైన ట్రాక్ షూ, స్పోర్ట్స్ డ్రస్, నైట్ డ్రస్, రగ్గులు, ట్రంకు పెట్టె, ప్లేటు, గ్లాసు తదితర వస్తువులను ఆమె పరిశీలించి అవి నాణ్యతంగా ఉండడం పట్ల ప్రత్యేకంగా ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. ఈ పరిశీలనలో ఆమె వెంట జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి శోభారాణి, ఏఎస్‌డబ్ల్యూ తిరుపతయ్య, ఎంపీపీ పార్వతి, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శ్యామ్‌సుందర్‌రెడ్డి,ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో సురేష్, ఎంఈవో–2 వై. చెంచులక్ష్మమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, సంక్షేమాధికారులు పద్మ, సుప్రజ, శోభారాణి, సుమలత, సునీత, కార్యాలయ పర్యవేక్షకులు దయాకర్, కూటమి నేతలు ఉన్నారు.

**– విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఎమ్మెల్యే** వసతి గృహాల్లో సదుపాయాలు , వాతావరణం భోజన వసతి ఏ విధంగా ఉంటాయని సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే విద్యార్థులను ప్రశ్నించి అడిగి తెలుసుకున్నారు. గతంలో తొలిసారి తాను ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు సంక్షేమ వసతి గృహాలకు ఇన్వర్టర్లు ఏర్పాటు చేయడం, విద్యార్థుల కోరిక మేరకు వాటర్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశామని, వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బంది పై అగ్రహం వ్యక్తం

### చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి



**నెల్లూరు, జూలై 19, ప్రభాతవార్త – వైద్యం** విధుల్లో నిర్లక్ష్యం వహించిన కొండాపురం గ్రంథాలయ సిబ్బందిపై నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఉదయగిరి నియోజకవర్గం కొండాపురం మండల కేంద్రంలో ఉన్నటువంటి గ్రేడ్ 3 గ్రంథాలయాన్ని నెల్లూరు జిల్లా గ్రంథాల సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి సందర్శించారు. స్థానిక నాయకులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. గ్రంథాలయం అపరిశుభ్రంగా ఉండడం, పుస్తకాలు పేపర్స్ సరైన పద్ధతిలో లేకపోవడంతో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నదాంట్లో అయిన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని అంకిత భావంతో సిబ్బంది పనిచేయాలని తెలియజేశారు. కొండాపురం గ్రంథాలయ అభివృద్ధికి స్థానిక నాయకులు అందరు సహకారంతో నా వంతు సహకారం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ రమేష్, మండల తెలుగు యువత అధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల భరోసాకే జగన్ 2.0 సూపర్ యాప్



**కోవూరు, జూలై 19ప్రభాతవార్త :** ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ప్రజలకు తెలియజేసేందుకే జగన్ 2.0 సూపర్ యాప్‌ను పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రారం భించారని వైసీపీ సీనియర్ నాయకులు తెలిపారు. ఆదివారం కోవూరులోని వైసీపీ కార్యాలయం లోజగన్ 2.0 సూపర్ యాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేతలు పార్టీ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ తమ సెల్‌ఫోన్‌లో ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

## ఇస్కపాలెంలో ఉచిత వైద్యశిబిరం




**నెల్లూరు కార్పోరేషన్, జులై 19 ప్రభాతవార్త :** స్పందన ఆసుపత్రి డాక్టర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో వెంకటాచలం మండల ఇస్కపాలెం గ్రామంలోని స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఐపిఎస్,ఎస్‌జెడ్, ఏపి కమ్యూనిటి సర్వీసెస్ సమక్షంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ శేషారత్నవం, డాకటర్ నవాజ్‌షరీఫ్, డాక్టర్లు వారి బృందం పేదలకు ఉచిత వైద్యం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ గ్రామంలో పేద ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించడం నా అదృష్టంగా బావిస్తున్నానని తెలిపారు. ఐపిఎస్, ఎస్‌జెడ్‌ఏపి కమ్యూనిటి సర్వీసెస్ తరపున సైకియాట్రిస్ట్ నరాల బలహీనతలు మద్యపానానికి బానిసైన వారికి విముక్తి చేసే చికిత్స ఎముకలు కీళ్ళపాతం నొప్పులకు మందులు ప్రాథమిక వైద్యం చేస్తున్నామని తెలిపారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా పేద ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించడమే మా ధ్యేయమని వైద్యసేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిధులు ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.మాబు సర్పంచ్ అడపాల ఏడుకొండలు, చెరువు రవిశంకర్, బత్తల మదుసూదన్ దుంపల సుబ్బారావు, తూపిలి వంశీక్రిష్ణ, బెల్లంకొండ ధనుంజయ, గ్రామస్థులు పాల్గొన్నారు.

